క్లుప్తంగా

యూరియా కోసం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందు: రైతులకు సరిపడా యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బానోతు ఊశ్లా ఆరోపించారు. ఆదివారం ఇల్లెందులోని మార్కెట్ యార్డులోని యూరియా విక్రయ కేంద్రం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ దర్నాలో అఖిలభారత రైతు కూలీ సంఘం నేతలు పోలారి శ్రీనివాసరావు, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు రాంసింగ్, శివనాయక్, రామారావు, బంగారు లక్ష్మి, బాబూరావు, వెంకన్న, నాగేష్, మల్సూర్ పాల్గొన్నారు.

జీఓ 282 రద్దు చేయండి..



మాట్లాడుతున్న రాసుద్దీన్

సింగరేణి(కొత్తగూడెం): నాలుగు లేబర్‌కోడ్‌లో భాగమైన జీఓ 282 ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రాసుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని ఇఫ్టూ జిల్లా కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల శ్రమను దోచుకునే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి మల్లికార్జున్‌రావు, గౌనీ నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, వాసు, శరత్, అశోక్, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాలకు పాలకమండలి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: ప్రభుత్వం జిల్లాలోని ఆలయాలకు పాలక మండలిని ఏర్పాటు చేయాలని తొలి,మలి 1969 ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని గాజులరాజం బస్తీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం, అన్నపురెడ్డిపల్లి, భద్రాచలం రామాలయ పాలక మండలి లేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు, డాక్టర్ రామ్మూర్తి, కాకెల్లి సైమన్, ఖమ్మం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీలో చేరిక

ఇల్లెందురూరల్: అరుణోదయ కళాకారుడు కాంపాటి సత్యం ఆదివారం న్యూడెమోక్రసీలో చేరారు. ఈ మేరకు పార్టీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు తదితరులు సత్యంకు ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరు ప్రాయం నుంచి న్యూడెమోక్రసీలో అరుణోదయ కళాకారుడిగా పనిచేసిన సత్యం చంద్రన్న వర్గంలో చేరినప్పటికీ తిరిగి పార్టీలోకి రావడం పార్టీ నిర్మాణాత్మక అభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మోతీలాల్, భద్రయ్య, నర్సయ్య, పాపయ్య, గుగులోత్ దేవా తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణంలో చింత!

- బాబోయ్.. మొర్రేడు వాగు బ్రిడ్జి
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గుడిపాడు వద్ద మొర్రేడు బ్రిడ్జిపై గుంతల్లో నిలిచిన వర్షం నీళ్లు

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసకాలనీ, గుడిపాడు గ్రామాల మధ్య గల మొర్రేడు వాగుపై ఉన్న బ్రిడ్జి అధ్వానంగా మారింది. ఈ బ్రిడ్జిపై అడుగుకో గుంత ఏర్పడటంతో బ్రిడ్జి నిర్మాణంపై ప్రభావం పడుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. ఈ వంతెనపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చక పోవడంతో వర్షాకాలంలో మరింత పెద్దగా మారుతూ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గుంతల్లో నీళ్లు నిలిచి అవి ఎంత పెద్ద గుంతలో తెలియక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తరచు తిరిగే వారికి మినహా ఇతరుల వాహనాలదారులకు ఈ రోడ్డుపై సరైన అవగాహన లేక గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఏడు గ్రామాలకు వారధి..

ఈ మొర్రేడు వాగుపై ఈ బ్రిడ్జి మీదుగా పిల్లవాగు, గుడిపాడు, పేటచెరువు, కొత్తూరు, బంగారుజాల, గుర్రాలకుంట, ధర్మన్ననగర్ గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో బ్రిడ్జి లేని సమయాల్లో ఇటుగా రాకపోకలు సాగించాలంటే ప్రజలు నానా అవస్థలు పడేవారు. వాగులో నుంచే దాటుకుంటు వెళ్లాల్సి వచ్చేది. వర్షాకాలంలో ఇక వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉండేది. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం మొర్రేడు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు. కాగా ఈ బ్రిడ్జి పరిస్థితి అధ్వానంగా మారింది. అదేవిధంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శివారు గ్రామాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాసిరకంగా నిర్మించారు. రోడ్డు వేసిన కొన్ని నెలలకే ఎక్కడిక్కడ పగిలిపోతున్నాయి. ఎన్నో సంవత్సరాల ఉండాల్సిన రోడ్లు నెలల వ్యవధిలో దెబ్బతినడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల ప్రజాధనం వృథాగా అయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొర్రేడు వాగు బ్రిడ్జి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని, సీసీ రోడ్లు పగిలిన విషయంపై విచారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పగుళ్లు వచ్చిన గుడిపాడు సీసీ రోడ్డు

బ్రిడ్జిపై పెద్దపెద్ద గుంతలు పడ్డాయి..



సుమారు ఏడు గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉండే మొర్రేడు వాగు బ్రిడ్జిపై ఉన్న గుంతలు ఇటీవల మరింత ఎక్కువై ఇబ్బందులు పడుతున్నాం. గుంతలు చిన్నగా ఉన్నప్పుడే పూడ్చితే బాగుండేది. వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఆరెం ప్రశాంత్, గుడిపాడు

అధికారులు స్పందించాలి...



మొర్రేడు వాగు బ్రిడ్జి గుంతలను సకాలంలో పూడ్చకపోవడం వల్ల బ్రిడ్జి దెబ్బతింటోంది. అధికారులు తక్షణం స్పందించాలి. అంతేగాక కొత్తగా వేసి సీసీ రోడ్లు ఇప్పటికే పగుళ్లు వస్తున్నాయి. నాణ్యత లేకుండా రోడ్లు వేశారు. పనులు జరుగుతున్నప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకనే ఇలా జరిగింది.

– కోరెం రమేష్, స్థానికుడు

కమ్యూనిజం ఎప్పటికీ అజరామరం..





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని (ఇన్‌సెట్) వాసిరెడ్డి మురళి

చుంచుపల్లి: కమ్యూనిజమనేది ఎప్పటికీ అజరామరమని, మనిషి మనుగడ ఉన్నంత వరకు కమ్యూనిస్టులు ఉంటారని, ఈ వందేళ్ల పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అనేక పోరాటాలు, త్యాగాలు చేసిందని, రాబోయే వందేళ్ల కూడా నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల 8వ మహాసభ ఆదివారం ఎన్‌కే నగర్‌లోని కమ్మ కళ్యాణ మండపంలో జరిగింది. కూనంనేని మాట్లాడుతూ.. అధికారం ఉన్నా లేకున్నా సమసమాజ స్థాపనే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పూటకో పార్టీ మారి రోజుకో కండువా కప్పుకోవడం గొప్పేం కాదని, నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ప్రజలకు మేలు చేసేందుకు పనిచేసే వారే నిజమైన నాయకులన్నారు. స్థానిక సమరంలో అవసరమైతే ఒంటరి పోరుకైనా సిద్ధమని, పార్టీ సత్తా చాటేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎస్‌కే సాబీర్‌పాషా, దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, చలిగంటి శ్రీనివాస్, సీహెచ్ మాధవరావు, పి.రామచందర్, బాదావత్ సుగుణ, తోట రాజు, పొలమూరి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, వాసిరెడ్డి మురళీ, శేషయ్య పాల్గొన్నారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక..

చుంచుపల్లి మండల మహాసభలో సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాసిరెడ్డి మురళీ, సంయుక్త కార్యదర్శిగా గనిగాళ్ల వీరస్వామి, సహాయ కార్యదర్శిగా పొలమూరి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

సీపీఐ రామవరం బ్రాంచి కార్యదర్శిగా గోపీకృష్ణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం సీపీఐ బ్రాంచి కార్యదర్శిగా మర్రి గోపీకృష్ణ ఎన్నికయ్యారు. పార్టీ మహాసభలో గుత్తుల శ్రీనివాస్ ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న బాధితులు

పాల్వంచరూరల్: పేదల కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని, అర్హులైన వారికి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జగన్నాథపురం గ్రామ పంచాయతీ ఎదుట బహుజన పూజార్ల, శివశక్తుల సేవా సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బాబారావు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశలో గ్రామసభలు నిర్వహించకుండానే కమిటీ సభ్యులు నచ్చిన వారికి ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఆ కమిటీని రద్దు చేసి మళ్లీ గ్రామసభ నిర్వహించి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్పుల వెంకటేష్, భూక్యా కుమార్, ఎం.సేవ్యా, ధర్మసోత్ రమేష్, జాటోత్ శంకర్ సాధు, బోడ బిచ్యా, వెంకటేష్, హన్‌మాన్ శర్మ, సాలి, లాలమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రవి

ఇల్లెందు: పాలకులు అనుసరించే విధానాల వల్ల ఎంతోమంది నిరుద్యోగులు రక్షణ లేని ఉద్యోగాల్లో చేరి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, ఈ తరుణంలో ఓ బాధ్యత గల ఉపాధ్యాయ సంఘంగా టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసినట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఆదివారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఇటీవల మృతి చెందిన బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల సీఆర్‌టీ ఉపాధ్యాయుడు మంగీలాల్ సతీమణి లీలావతికి రూ.6 లక్షల చెక్కు అందజేశారు. రవి మాట్లాడుతూ.. సీఆర్‌టీగా పదేళ్లు పని చేసిన మంగీలాల్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి పైసా వచ్చే అవకాశం లేదన్నారు.

ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ పథకం ప్రవేశపెట్టి ప్రతీ ఉపాధ్యాయుడిని సభ్యుడిగా చేర్చి ప్రతీ ఏడాది రూ.100 జమ చేస్తున్నామని తెలిపారు. ఈ నిధి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 40 మందికి రూ.6 లక్షలు చొప్పున అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, ఉమాశంకర్, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, కిషోర్ సింగ్, దాసు, తావుర్యా, జయరాజు, పాషా, రాంబాబు, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, కృష్ణవేణి, అన్నపూర్ణ, రమేష్, మాన్‌సింగ్, హరికుమార్, బాలస్వామి, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



ఓపీ నమోదు చేసుకుంటున్న పేషంట్లు

ఇల్లెందు: పట్టణంలోని మొయిన్ రోడ్ హైస్కూల్‌లో ఖమ్మం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ ఖమ్మం హాస్పిటల్ వారు ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయులు లాలు ప్రారంభించారు. సుమారు 800 మందికి వివిధ డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ భీమిరెడ్డి బాబురెడ్డి, కందటి రవిరెడ్డి, ఎం.మధు, కాకర్లమూడి అనిల్ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో..

సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశానుసారం పోలంపల్లి గ్రామపంచాయతీలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్, మాజీ సర్పంచ్ దారావత్ భద్రు, యూత్ నాయకులు ధోనీల అభ్యర్థన మేరకు గ్రామంలో వివిధ జబ్బులతో బాధపడే వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ జి.నరసింహరావు, స్టాఫ్ నర్స్ కవిత, సలీం పాల్గొన్నారు.

ఆధార్ జిరాక్స్‌లు ఇవ్వాలి

టేకులపల్లి: బేతంపూడి సొసైటీ నుంచి అప్పు తీసుకున్న రైతులు సోమవారం ఉదయం 10 గంటలకు ఆధార్ జిరాక్స్ కాపీలతో సొసైటీ కార్యాలయానికి రావాలని పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వడ్డీ రాయితీ వర్తిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి..



జూలూరుపాడులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: 23న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో ఆయన నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పవన్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వీధిలైట్లు వెలగక అంధకారం



చీకట్లో నాగారం ప్రధాన వీధి

పాల్వంచరూరల్: మూడు రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో నాగారం గ్రామం అంధకారంలో మగ్గుతోంది. ప్రజలు ఏపీ రాష్ట్రంలోని గ్రామాలకు వెళ్లాలంటే నాగారం గ్రామం మీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. గ్రామంలో ప్రధాన రహదారిలోని వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని, గ్రామకార్యదర్శికి స్థానికులు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న వీధిలైట్లు వెలగకుండా ఇసుక స్మగ్లర్లు అడ్డు పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంధకారంలో ఉన్న గ్రామంలో రాకపోకలు కొనసాగించాలంటే స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో స్థానికుల ఇబ్బందులు



టీడబ్ల్యూఆర్ గురుకులానికి వెళ్లే రోడ్డు



సుభాష్‌నగర్‌లో అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో రూ.పది కోట్ల వ్యయంతో సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు ఏడాది క్రితం రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. ప్రారంభంలో వేగంగా పనులు చేపట్టిన అధికారులు నెల రోజులుగా పనులు ఎక్కడికక్కడే వదిలేశారు. పలు అంతర్గత రోడ్లకు వెళ్లే మార్గాలలో గుంతలు తవ్వి కాల్వలపై స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వదిలేశారు. దీంతో ఆయా వీధులలోకి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు గుంతలపై కర్రలతో వంతెన ఏర్పాటు చేసుకొని ప్రమాదకరంగా దాటుతున్నారు. టీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గంలో కాల్వ తవ్వి నెల రోజులకు పైగా గడిచినా పనులు జరగడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాల్వ దాటే మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోంది. రోజులు తరబడి కాల్వల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో మొట్లగూడెం గ్రామస్తులు కాల్వను పూడ్చి రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించుకున్నారు.

జల్లులతో తేరుకున్న పంటలు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరుణుడు కరుణ లేకపోవడంతో విత్తనాలు విత్తుకున్న రైతులు ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ప్రతీరోజు కారుమబ్బులు కమ్ముకుంటున్నా చినుకు జాడ లేకపోవడంతో రైతుల్లో కలవరం ప్రారంభమైంది. ఈ ఏడాది పంటల దిగుబడిపై ఆందోళన పడుతున్నారు. కానీ మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలు ఇప్పుడిప్పుడే వస్తున్న మొలకలకు జీవం పోశాయి. ముందస్తుగా విత్తుకున్న చోట మొక్కలు వడలిపోయే దశలో చేరుకున్న తరుణంలో కురిసిన వర్షాలు మొక్కలకు ప్రాణం పోశాయి. ఈ పరిణామంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తూ చేలలో కలుపు తీస్తూ.. ఎరువు వేసే పనులలో నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్ నాయకుడు బాబూరావు మృతి

ఇల్లెందు: పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సింగరేణి కార్మికుడు ఆర్.బాబూరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ కోసం పని చేశారు. బాబూరావు మృతి సమాచారం అందుకున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్, జాఫర్, ఇమామ్, వత్సా వెంకటేశ్వర్లు, శంకర్, సతీష్,సరోజ, పత్తి స్వప్న, లక్ష్మణరావు తదితరులు నివాళి అర్పించారు

పల్లెల్లో బోనాల పండుగ



కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌లో బోనాలతో వస్తున్న మహిళలు

కొత్తగూడెంటౌన్: ఆషాఢమాసం ఆదివారం కావడంతో అమ్మవారికి బోనాలను సమర్పించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. రామవరం, రుద్రంపూర్, కొత్తగూడెం, విద్యానగర్ కాలనీ, లక్ష్మీదేవిపల్లిలతో పాటు పలు ప్రాంతాల్లోని ప్రజలు అమ్మవార్లకు ఊరేగింపుగా బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాలతో, నృత్యాలు చేసుకుంటూ ఆలయాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

జూలూరుపాడు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగను ఆదివారం మండలంలోని పలు గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాపకొల్లు, కాకర్ల, అనంతారం, తదితర గ్రామాల్లో ప్రజలు శ్రీకోటమైసమ్మ తల్లి, శ్రీపెద్దమ్మతల్లి, శ్రీముత్యాలమ్మ తల్లికి మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. అదే విధంగా గ్రామ కూడలిలోని బొడ్రాయి (నాభిశిల)ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యం ఉండాలని, సుఖసంతోషాలతో ఉండేలా చల్లంగా చూడాలంటూ గ్రామదేవతలను వేడుకున్నారు.

టేకులపల్లి: గ్రామ దేవతలు మైసమ్మ, పోచమ్మ, పోలేరమ్మ, కట్ట మైసమ్మ, మహంకాళి, ముత్యాలమ్మ, బొడ్రాయి, పోతురాజు వంటి గ్రామదేవతలు, దేవుళ్లకు ఆదివారం మండలంలోని ప్రజలు పలుగ్రామాల్లో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

పాల్వంచరూరల్: ఆషాఢమాసం చివరి ఆదివారం మహిళలు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మండలంలోని జగన్నాథపురంలో మహిళలు ఆదివారం బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.



పాల్వంచరూరల్: జగన్నాథపురంలో..



జూలూరుపాడు: అనంతారంలో...



టేకులపల్లి: సింగ్యా తండాలో...

వరదొస్తే రాకపోకలు బంద్

- రాంపురం వంతెన కష్టాలు తీరేదెన్నడు ?
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజలు





పాతతండా - రాంపురం మధ్య రాళ్లవాగు చప్టా, చప్టా మీదుగా వరద ఉధృతి (ఫైల్)

టేకులపల్లి: టేకులపల్లి మండలం పాతతండా – రాంపురం మధ్య రాళ్లవాగు వంతెన కోసం ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. ఇక్కడ నిర్మించిన చప్టా వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. వరదొస్తే చాలు ఈ చప్టా మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎప్పటిలానే రాకపోకలు నిలిచిపోతుండటం నిత్య కృత్యంగా మారింది. ఈ సమయంలో ఏదైనా ఎమర్జెన్సీ వస్తే అంతే సంగతులు. టేకులపల్లి, కొత్తతండా(పి), దుబ్బతండా, పాతతండా, హరిజనచెర్రితో పాటు రాంపురం గ్రామస్తులకు చెందిన సుమారు 3500 ఎకరాల పోడు సాగు భూములు రాంపురం అవతల సుజాతనగర్ మండలం సింగభూపాలెం పరిధిలో ఉన్నాయి. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో ఆయా గ్రామాల రైతులు సాగు పనుల నిమిత్తం ఈ వాగు (చప్టా) దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఇక వర్షాకాలంలో వరదొస్తే ఈ వాగు దాటడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. గత సంవత్సరం సెప్టెంబర్ 8న రాంపురం గ్రామానికి చెందిన ఆబోతు వాగు దాటబోయి వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. సకాలంలో గుర్తించిన గ్రామస్తులు దానిని కాపాడారు. గతంలో కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పాతతండా నుంచి రాంపురం వరకు బీటీ రోడ్డు వేశారు. హైలెవెల్ బ్రిడ్జి మాత్రం మంజూరు కాలేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పాతతండా – రాంపురం మధ్య రాళ్లవాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంది..



టేకులపల్లి, దాసుతండా, గోలియాతండా, కొత్తతండా(పి), దుబ్బతండా, పాతతండా, హరిజనచెర్రితో పాటు రాంపురం గ్రామస్తుల సుమారు 3500 ఎకరాల పోడు సాగు భూములు రాంపురం అవతల సుజాతనగర్ మండలంలో ఉన్నాయి. వానాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇప్పటికే ప్రాణాపాయం నుంచి బయటపడిన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బానోత్ బన్సీలాల్, పాతతండా

హైలెవెల్ వంతెన నిర్మించాలి..



పాతతండా – రాంపురం మధ్య రాళ్లవాగుపై నిర్మించిన చప్టా వల్ల ఉపయోగం లేదు. వానాకాలంలో వరదొస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమయంలో ఏదైనా అత్యవసరం అయితే ఇక అంతే సంగతులు. అధికారులకు, పాలకులకు పలుమార్లు బ్రిడ్జి కోసం వినతిపత్రాలు అందజేయడం జరిగింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక చొరవ తీసుకుని హైలెవెల్ బ్రిడ్జిని మంజూరు చేసి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలి.

– గుగులోత్ రవీందర్, రాంపురం